సాక్షి
అనంతపురం
శనివారం । 25 । ఫిబ్రవరి । 2023



టన్ను చీనీ రూ.40,500
అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో శుక్రవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.40,500, కనిష్టంగా రూ.15 వేలు, సరాసరిన రూ.22 వేల మేర ధర పలికాయి.



కిలో టమాట రూ.23
అనంతపురం శివారులోని కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్టంగా రూ.23, కనిష్టంగా రూ.4.50, సరాసరిన రూ.10 ప్రకారం అమ్మకాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
38.5°/ 12.7°
జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదు కాగా, రాత్రి ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గాయి. దీంతో సీజన్ చివర్లో చలి తీవ్రత పెరిగింది. గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో ఈశాన్యం నుంచి ఆగ్నేయ దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

మత్స్య ఉత్పత్తుల వినియోగం పెంపునకు కృషి



మాట్లాడుతున్న మత్స్యశాఖ డీడీ శాంతి

గుంతకల్లుటౌన్: మత్స్య ఉత్పత్తుల వినియోగాన్ని పెంచడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం 'ఫిష్ ఆంధ్ర – ఫిట్ ఆంధ్రా' పేరుతో ఫిష్ హబ్‌లు, ఫిష్ అవుట్‌లెట్ల ఏర్పాటుకు సహకారమందిస్తోందని మత్స్యశాఖ డీడీ శాంతి తెలిపారు. శుక్రవారం గుంతకల్లు మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో చేపల పెంపకందార్లు, వ్యాపారులతో ఆమె సమావేశం నిర్వహించారు. డీడీ మాట్లాడుతూ ప్రజలకు తక్కువ ధరకే నాణ్యమైన తాజా చేపలు, రొయ్యలనే కాకుండా ఎండు, వండటానికి సిద్ధంగా ఉన్న చేపలు, మసాలా పట్టించిన ఉత్పత్తులు, వండిన, ఫ్రై చేసిన వంటకాలు, పచ్చళ్లు వంటి వాటిని విక్రయించడానికి మత్స్యకారులతో రిటైల్ అవుట్‌లెట్ల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, డీఆర్‌డీఏ ఏపీఎం రామ్మూర్తి, మెప్మా టీపీఆర్‌ఓ జి.మోహన్, సీఎంఎం ఎస్.భవాని, సీఓలు, చేపల విక్రేతలు పాల్గొన్నారు.

పోలీసుల సంక్షేమానికి పెద్ద పీట



గ్రీవెన్స్‌లో సిబ్బంది సమస్యలు వింటున్న ఎస్పీ ఫక్కీరప్ప

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: పోలీసుల సంక్షేమానికి పెద్ద పీట వేస్తామని ఎస్పీ ఫక్కీరప్ప అన్నారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణంలోని పోలీసు కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన గ్రీవెన్స్‌కు జిల్లా వ్యాప్తంగా 15 మంది పోలీసులు హాజరై తమ సమస్యలను ఎస్పీకి విన్నవించారు. ఈ సందర్భంగా ఎస్పీ వారి సమస్యలను పరిష్కరించాల్సిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ సిబ్బంది చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా కుటుంబ ఆర్థిక, ఆరోగ్య పరిస్థితులను చక్కదిద్దుకోవాలని సూచించారు. పిల్లలకు ఉన్నతమైన భవిష్యత్ అందించాలన్నారు. మన క్రమ శిక్షణ పిల్లల జీవితాలపై ప్రభావం చూపుతుందన్నారు. ఎంతో బిజీగా గడిపే పోలీసులు కుటుంబ సభ్యులకు కూడా కొంత సమయాన్ని కేటాయించి వారి బాగోగులు కూడా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఇ.నాగేంద్రుడు, జిల్లా పోలీస్ కార్యాలయ పరిపాలనాధికారి శంకర్, వివిధ విభాగాల సూపరింటెండెంట్లు తదితరులు పాల్గొన్నారు.

మద్దతు ధరతో జొన్నల కొనుగోళ్లు

అనంతపురం అర్బన్: జొన్న సాగుచేసిన రైతులకు ఇబ్బందులేకుండా ప్రభుత్వమే కనీస మద్దతు ధరలతో కొనుగోలు చేస్తుందని ఇన్‌చార్జి కలెక్టర్ కేతన్‌గార్గ్ తెలిపారు. రవాణా, కూలీ ఖర్చులు సైతం ప్రభుత్వమే భరిస్తుందని శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. జిల్లాలో పీఎస్‌ఏ, పీఏసీఎస్ ద్వారా ఈ రబీ సీజన్‌లో జొన్నల సేకరణ ప్రారంభమైందన్నారు. హైబ్రిడ్ జొన్న రకం క్వింటాలుకు రూ.2,970, మలదండి రకం జొన్నలకు క్వింటాలుకు రూ.2,990 చొప్పున ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించిందన్నారు. ప్రభుత్వానికి జొన్నలు విక్రయించాలనుకునే రైతులు ఆర్‌బీకేల్లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

గవిమఠం బ్రహ్మోత్సవాలు ప్రారంభం



పవిత్ర గంగజలాన్ని ఊరేగింపుగా తీసుకొస్తున్న మఠం అర్చకులు

ఉరవకొండ: ప్రసిద్ధ ఉరవకొండ గవిమఠ చంద్రమౌళీశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. స్థానిక ఎదురుబసవన్న ఆలయం నుంచి పవిత్ర గంగాజలాన్ని ఊరేగింపుగా తీసుకొచ్చి.. కంకణ మండపంలో ప్రత్యేక పూజలు నిర్వహించి బ్రహ్మోత్సవాలను ప్రారంభించారు. కార్యక్రమంలో గవిమఠం సహాయ కమిషనర్ చిట్టెమ్మ, ఏజెంట్ రాజన్నగౌడ్, మఠం సిబ్బంది శంకర్, నారాయణస్వామి, గోపీ, మధు తదితరులు పాల్గొన్నారు.

పట్టు కోక.. ఎగుమతులు కేక



ధర్మవరం పట్టుచీర అంతర్జాతీయంగా ఖ్యాతి గాంచింది. ఫ్యాషన్ ప్రపంచానికి దీటుగా డిజైన్లతో సొబగులద్దుకుంది. నాణ్యమైన పట్టు, డిజైన్లలో మగువల మనసు దోచుకుంటోంది. దేశ విదేశాలకు ఎగుమతి అవుతోంది. శ్రీసత్యసాయి జిల్లాలో ఒక పరిశ్రమగా ఏర్పడి, వేలాది కుటుంబాలకు జీవనోపాధిగా మారింది. జిల్లాలో ఉన్న హ్యాండ్‌లూమ్స్, పవర్ లూమ్స్‌లో తయారవుతున్న చీరల్లో 90 శాతం చీరలు ధర్మవరంలోనే తయారు కావడం విశేషం.

సాక్షి ప్రతినిధి, అనంతపురం

నిమిషానికి 22 చీరలు
- శ్రీసత్యసాయి జిల్లాలో 16 వేల పవర్‌లూమ్స్
- రోజుకు 32 వేల చీరల ఉత్పత్తి
- దేశీయ మార్కెట్‌లో ధర్మవరం చీరలకు ప్రత్యేక గుర్తింపు
- 28 వేల హ్యాండ్‌లూమ్స్‌లో నెలకు 1.12 లక్షల చీరలు
- దేశవిదేశాలకు ధర్మవరం పట్టుచీరల ఎగుమతులు

పట్టుచీరలకు శ్రీసత్యసాయి జిల్లా పెట్టింది పేరు. జిల్లాలోని ధర్మవరం, హిందూపురం, ముదిరెడ్డిపల్లి చేనేత ప్రధాన కేంద్రాలు. హ్యాండ్‌లూమ్స్‌తో పాటు పవర్‌లూమ్స్ ద్వారా దాదాపు 36 వేల చీరలు తయారవుతున్నాయి. వివాహాది శుభకార్యాల్లో 'ధర్మవరం పట్టు'ది ప్రత్యేక స్థానం. దేశంలోని వివిధ రాష్ట్రాలతో పాటు విదేశాలకూ ఎగుమతి అవుతున్నాయి. ఇందులో ఎక్కువ చీరలు ధర్మవరంలోనే తయారవుతున్నాయి. ధర్మవరంలో ఒక్క వారంలోనే రూ.వంద కోట్ల టర్నోవర్ జరుగుతోంది.

చీరల ఉత్పత్తిలో అగ్రగామి ధర్మవరం

శ్రీసత్యసాయి జిల్లాలోని ధర్మవరం...దేశంలోనే అత్యధికంగా చీరల తయారయ్యే ప్రాంతం. జిల్లాలో 16 వేలపైచిలుకు పవర్‌లూమ్స్ ఉన్నాయి. నెలకు సరాసరిన 9.60 లక్షల చీరలు ఈ జిల్లాలోనే ఉత్పత్తి



పట్టుచీరలను చూపుతున్న వ్యాపారులు

జరుగుతోంది. హ్యాండ్‌లూమ్స్ ద్వారా నెలకు మరో 1.12 లక్షల చీరలు ఉత్పత్తి అవుతున్నాయి. మొత్తంగా ఇక్కడ నిమిషానికి 22 చీరలు ఉత్పత్తి అవుతున్నాయి. ఇక్కడ రూ.వేయి నుంచి రూ.లక్ష వరకు విలువ చేసే చీరలు లభిస్తున్నాయి.

విదేశీయుల మదిలో మెదిలే డిజైన్లు..

ఫ్యాషన్ ప్రపంచంలో చీరలకున్న పోటీ అంతా ఇంతాకాదు. ఇంత పోటీలోనూ ధర్మవరం చీరలు దీటుగా నిలుస్తున్నాయి. ఇక్కడి డిజైనర్లు ఎప్పటికప్పుడు కొత్త డిజైన్లు రూపొందిస్తున్నారు. అందువల్లే అమెరికా, ఆస్ట్రేలియా, న్యూజిల్యాండ్, దుబాయ్, లండన్, మలేషియా వంటి దేశాలకు ధర్మవరం నుంచి ఎగుమతి అవుతున్నాయి. వస్‌గ్రాం గోల్డ్, హాఫ్ అండ్ హాఫ్ శ్యారీ, ఎంబోజ్ బ్రోకెట్ వంటి డిజైన్లను మగువలను ఇట్టే ఆకర్షిస్తున్నాయి. తెలుగు సినిమా ఇండస్ట్రీలోనూ ఇక్కడి పట్టు చీరలు హీరోయిన్‌లకు సొబగులద్దుతున్నాయి.

28,000
జిల్లాలోని హ్యాండ్‌లూమ్స్

1,12,000
హ్యాండ్‌లూమ్స్ ద్వారా నెలలో ఉత్పత్తయ్యే చీరలు

16,000
జిల్లాలో పవర్ లూమ్స్

9,60,000
పవర్‌లూమ్స్ నుంచి నెలలో తయారయ్యే చీరలు

అత్యాధునిక సాంకేతికతతో..



దేశవాళీ పట్టు చీరల మార్కెట్‌కు ధర్మవరం ప్రధాన వేదిక. ఇప్పుడున్న పోటీని తట్టుకోవాలంటే ఆధునిక సాంకేతిక పద్ధతులతో చీరలు తయారు చేయాలి. పోటీని తట్టుకునేలా విభిన్న డిజైన్లు ఉండాలి. వేలాది మందికి ఈ పరిశ్రమ ఉపాధి ఇస్తోందంటే ఇక్కడి డిజైన్లే ప్రధాన కారణం.
–నాగరాజు, డిజైనర్, ధర్మవరం

అంతర్జాతీయ ఖ్యాతి



ధర్మవరం చీరలకు అంతర్జాతీయంగా పేరుంది. ఎప్పటికప్పుడు కొత్త చీరలను తయారు చేస్తున్నాం. మా చీరలు మహారాష్ట్ర, తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు ఎగుమతి అవుతాయి. చాలా దేశాలకు ఇక్కడి నుంచే చీరలు వెళ్తున్నాయి.
– చిర్లా భాస్కర్‌రెడ్డి, పట్టుచీరల వ్యాపారి, ధర్మవరం

మంగమ్మ విజయదరహాసం



సానిపల్లి మంగమ్మను సన్మానిస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య తదితరులు

- 'స్థానిక' ఎమ్మెల్సీగా ఏకగ్రీవం
- అధికారికంగా ప్రకటించడమే తరువాయి
- సన్మానించిన వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే తోపుదుర్తి
- స్వగ్రామం మునిమడుగులో సంబరాలు

పెనుకొండ రూరల్: ఉమ్మడి అనంతపురం జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ కోటా కింద వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా నామినేషన్ వేసిన ఎస్.మంగమ్మ ఎన్నిక ఏకగ్రీవానికి మార్గం సుగమమైంది. ఆమెకు పోటీగా యాడికి మండలం కొత్తపల్లికి చెందిన వేలూరు రంగయ్య స్వతంత్ర అభ్యర్థిగా వేసిన నామినేషన్ స్క్రూటినీలో తిరస్కరణకు గురైంది. ఇక అధికారికంగా మంగమ్మ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించడమే మిగిలి ఉంది. దీంతో సానిపల్లి మంగమ్మను వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం సన్మానించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

మునిమడుగులో మిన్నంటిన సంబరాలు..

శుక్రవారం సాయంత్రం మంగమ్మకు స్వగ్రామం పెనుకొండ మండలం మునిమడుగులో ఘన స్వాగతం లభించింది. వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులు, గ్రామస్తులు పెద్ద ఎత్తున బాణసంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు శ్రీనివాసులు, భాస్కర్, చిన్నపరెడ్డి పల్లి రాము, డీలర్ సత్యనారాయణ, నటేష్, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

16 నామినేషన్ల తిరస్కరణ..

అనంతపురం అర్బన్: పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ, అనంతపురం స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానాలకు దాఖలైన నామినేషన్లలో 16 నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. శుక్రవారం కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో స్థానిక సంస్థల ఎన్నికల పరిశీలకుడు ప్రవీణ్ ప్రకాశ్ సమక్షంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఇన్‌చార్జ్ కలెక్టర్ కేతన్‌గార్గ్ ఆధ్వర్యంలో స్క్రూటినీ నిర్వహించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీకి 63 మంది అభ్యర్థులు 94 సెట్ల నామినేషన్లు వేశారు. వీరిలో 12 మంది అభ్యర్థుల నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి 17 మంది 29 సెట్లు దాఖలు చేశారు. ఇందులో ముగ్గురు అభ్యర్థుల నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. స్థానిక సంస్థల ఎమ్మెల్సీకి ఎస్.మంగమ్మ(వైఎస్సార్‌సీపీ అభ్యర్థి), వేలూరు రంగయ్య (స్వతంత్ర్య అభ్యర్థి) నామినేషన్ వేశారు. ఇందులో రంగయ్య నామినేషన్ తిరస్కరణకు గురయ్యింది. దీంతో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ బరిలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి మంగమ్మ ఒక్కరే మిగలడంతో ఆమె ఎన్నిక లాంఛనమే అయ్యింది.

నామినేషన్ల తిరస్కరణ ఇలా..

ఎమ్మెల్సీ	అభ్యర్థుల సంఖ్య	తిరస్కరణ	ఆమోదం
పట్టభద్రులు	63	12	51
ఉపాధ్యాయ	17	3	14
స్థానిక సంస్థలు	2	1	1



సానిపల్లి మంగమ్మకు స్వాగతం పలుకుతున్న పార్టీ శ్రేణులు

నవ సమాజం నిర్మిద్దాం



ప్రసంగిస్తున్న డాక్టర్ నీతూ ఖన్నా



సత్యసాయి మహాసమాధిని దర్శించుకుంటున్న తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూరేపల్లి నంద

- మహిళా సాధన శిబిర్‌లో వక్తలు

ప్రశాంతి నిలయం: సత్యసాయి బోధనల స్ఫూర్తితో నవ సమాజ నిర్మాణంలో మహిళలు భాగస్వాములు కావాలని వక్తలు పిలుపునిచ్చారు. కుటుంబ స్థాయి నుంచి సమాజ నిర్మాణం వరకు అన్ని రంగాల్లోనూ మహిళలు కీలకశక్తిగా ఎదగడం గర్వకారణమని అన్నారు. దేశీయ సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో 'మహిళా సాధన శిబిర్' పేరిట మూడు రోజుల పాటు సాగే సదస్సు శుక్రవారం ప్రశాంతి నిలయంలో ప్రారంభమైంది. సత్యసాయి సేవా సంస్థలు, మహిళా సాధికారత సంస్థలకు చెందిన మూడువేల మందికి పైగా మహిళలు పాల్గొన్నారు. ఉదయం సత్యసాయి మహాసమాధి చెంత తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూరేపల్లి నంద, శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్ సతీమణి హిమవాహిని రత్నాకర్, సత్యసాయి సేవా సంస్థల జాతీయ మహిళా కోఆర్డినేటర్ డాక్టర్ నీతూఖన్నా, శశి బాల జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, మధ్యప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల ఆదివాసీ సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబిస్తూ మహిళలు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నీతూఖన్నా మాట్లాడుతూ మహిళా సాధికారను ఆకాంక్షించిన గొప్ప మావవతావాది సత్యసాయి అని గుర్తు చేశారు. సత్యసాయి సేవా సంస్థల నిర్మాణంలో మహిళలకు ప్రత్యేకస్థానం కల్పించారన్నారు. మహిళా విద్యను ప్రోత్సహించారన్నారు. ప్రపంచ వ్యాప్తంగా కోవిడ్ విజృంభించిన సమయంలో కూడా సత్యసాయి సేవా సంస్థల మహిళా విభాగం సభ్యులు ఆయా ప్రాంతాల్లో సేవ, ఆధ్యాత్మిక, వ్యక్తిగత సాధన కార్యక్రమాలు ఎంతో చురుగ్గా నిర్వహించారన్నారు. తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూరేపల్లి నంద మాట్లాడుతూ నేటి మహిళలు తమ హక్కులు, బాధ్యతలను తెలుసుకుని, అవకాశాలను సద్వినియోగం చేసుకుని ప్రపంచాన్ని మరింత ముందుకు నడిపేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం చెన్నైకి చెందిన సుందరం మహిళా బృందం సభ్యులు సత్యసాయి లీలలను కీర్తిస్తూ నిర్వహించిన సంగీత కచేరీ అలరించింది. పూర్ణచంద్ర ఆడిటోరియంలో సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్ రాజు, సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ వైస్ చైర్మన్ నిమీష్‌పాండే మహిళా సాధికారత సాధనలో సత్యసాయి లక్ష్యాలు, సత్యసాయి ట్రస్ట్ కార్యక్రమాల వివరించారు.



సదస్సులో పాల్గొన్న మహిళలు

రైతుల ఖాతాల్లోకి రూ.115 కోట్లు

- 27న వైఎస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్ ఆఖరి విడత
- ఒక్కొక్కరికి రూ.2 వేల చొప్పున నగదు జమ



అనంతపురం అగ్రికల్చర్: రైతులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. వైఎస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్ పథకానికి సంబంధించి ఈ ఏడాదికి ఆఖరి విడతగా రూ.2 వేల పెట్టుబడి సాయం ఈనెల 27న రైతుల ఖాతాల్లోకి జమ కానుంది. ఉమ్మడి అనంతపురం జిల్లా పరిధిలో 5,52,176 మంది రైతుల ఖాతాల్లో రూ.115.66 కోట్లు జమ చేయనున్నట్లు అధికారులు తెలిపారు. వైఎస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్ పథకం కింద ప్రభుత్వం రైతులకు ఏటా రూ.13,500 చొప్పున ఆర్థిక సాయం అందిస్తోంది. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం రూ.7,500, కేంద్రం రూ.6 వేలు ఇస్తోంది. కౌలు రైతులు, అటవీ భూముల సాగుదారులు, దేవదాయ భూముల సాగుదారులకు రాష్ట్ర ప్రభుత్వమే పూర్తి మొత్తం చెల్లిస్తోంది. ఇలా నాలుగో ఏడాదికి సంబంధించి ఖరీఫ్‌కు సాయంగా 2022 మేలో రూ.7,500, రబీ సాయంగా అక్టోబర్‌లో రూ.4 వేలు చొప్పున ప్రభుత్వం రైతుల ఖాతాల్లో జమ చేసింది. తుది విడతగా సంక్రాంతి కానుకగా రూ.2 వేలు చొప్పున ఇవ్వాల్సి ఉండగా... ఈకేవైసీ తప్పనిసరి చేయడంతో నెల రోజులు ఆలస్యంగా ఈనెల 27న విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. మొదటి రెండు విడతల కింద అనంతపురం జిల్లాకు రూ.321 కోట్లు ఇవ్వగా, ఇపుడు ఇచ్చే రూ.59.11 కోట్ల మొత్తం కలిపితే ఈ ఏడాది రూ.380 కోట్లకు పైగా లబ్ధి చేకూరినట్లు అవుతుంది. అలాగే మొదటి రెండు విడతల కింద శ్రీసత్యసాయి జిల్లా రైతులకు రూ.308 కోట్లకుపైగా ఇవ్వగా, ఇపుడు ఇవ్వనున్న రూ.56.55 కోట్లు మొత్తం కలిపితే రూ.365 కోట్ల వరకు ప్రయోజనం కలగనుంది. ఇలా ఉమ్మడి జిల్లా పరిధిలో ఈ ఏడాది రూ.745 కోట్ల మేర రైతులకు భరోసా కల్పించారు.

వైభవంగా గావుల మహోత్సవం





ప్రత్యేక అలంకరణలో పోతలయ్యస్వామి మూలవిరాట్, ఆలయం వద్ద భక్తుల సందడి

- భక్తులతో కిటకిటలాడిన దాదులూరు

కనగానపల్లి: దాదులూరు పోతలయ్యస్వామి జాతరలో కీలకమైన గావుల మహోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. తెల్లవారుజామునే భక్తులు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి బోనాలు సమర్పించారు. అనంతరం ఉరుముల శబ్దాలు, పోతరాజుల విన్యాసాల నడుమ 15 మేకపోతు పిల్లలను బలిచ్చి స్వామికి రక్తతర్పణం చేశారు. ఈ ఘట్టాన్ని తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులతో దాదులూరు కిక్కిరిసిపోయింది. అనంతరం పలువురు భక్తులు ఆలయం ముందు పొట్టేళ్లు, మేకపోతులను బలిచ్చి స్వామికి మొక్కులు సమర్పించుకున్నారు.

కిక్కిరిసిన పరుష..


దాదులూరు పరుష జనంతో కిక్కిరిసిపోయింది. గురువారం రాత్రి నుంచి శుక్రవారం సాయంత్రం వరకు భక్తులు పోతలయ్యస్వామిని దర్శించుకునేందుకు పోటెత్తారు. ఆలయంలో క్యూలైన్లతో పాటు చుట్టూ ఉన్న పరుష ప్రాంతం జనంతో నిండిపోయింది. జాతరలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా గట్టి భద్రతా చర్యలు తీసుకొన్న పోలీస్, రెవెన్యూ, పంచాయతీ సిబ్బందికి ఆలయ కమిటీ చైర్మన్ రామలింగారెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు.

నమస్తే సార్...



రాష్ట్ర గవర్నర్‌గా ఎస్.అబ్దుల్ నజీర్ శుక్రవారం ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం రాజ్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీచరణ్ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

పెరగనున్న ఉష్ణోగ్రతలు



బుక్కరాయసముద్రం: జిల్లాలో రానున్న ఐదు రోజుల్లో ఉష్ణోగ్రతలు పెరగనున్నాయి. 36.2 నుంచి 37.1 డిగ్రీల సెల్సియస్ నమోదు కానున్నట్లు ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధనా స్థానం అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సహదేవరెడ్డి, సీనియర్ శాస్త్రవేత్త అశోక్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పగటి ఉష్ణోగ్రతలు 36.2–37.1 రాత్రి 14.1–15.8 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదు కావొచ్చని పేర్కొన్నారు. గాలిలో తేమ శాతం ఉదయం 38–67, మధ్యాహ్నం 11–16గా నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు.

విషపు రాతలపై నిరసనాగ్రహం



అనంతపురం: ఈనాడు పత్రిక ప్రతులతో నిరసన తెలియజేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



రాప్తాడు: ఈనాడు పత్రిక ప్రతులను దహనం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

అనంతపురం సప్తగిరి సర్కిల్: పట్టాభి వ్యవహారంపై పచ్చపత్రికలో వస్తున్న తప్పుడు కథనాలపై నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. ఈనాడు డౌన్ డౌన్ అంటూ ఆ పత్రిక ప్రతులను దహనం చేస్తూ జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఆందోళన కొనసాగిస్తున్నారు. జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య ఆధ్వర్యంలో ఈనాడు దినపత్రికలో వస్తున్న తప్పుడు కథనాలకు వ్యతిరేకంగా ఆ పత్రిక ప్రతులను దహనం చేసి నిరసనను తెలిపారు. ఈ సందర్భంగా నగర మేయర్ మొహమ్మద్ వసీం సలీం, డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, నగర అధ్యక్షుడు చింత సోమశేఖరరెడ్డి, మహిళ విభాగం జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి మాట్లాడుతూ ఎలాగైనా సరే తప్పుడు కథనాలతో ప్రజలను తప్పుదోవ పట్టించాలని పచ్చ పత్రిక దిగజారి వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. జర్నలిజం ద్వారా ప్రజలకు వాస్తవాలను తెలియజేయడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాల్సిన పత్రిక ఇలాంటి నీచ రాజకీయాలు చేస్తుండటం తగదన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. చంద్రబాబు అడుగులకు మడుగులు వత్తుతూ ప్రభుత్వ ప్రతిష్టను దెబ్బతీయాలనే తప్పుడు కథనాలు రాస్తున్నారని విమర్శించారు. పట్టాభిరాం అనే తెలుగుదేశం పార్టీ నాయకుడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై నిత్యం అసత్యాలు ప్రచారం చేస్తూ పచ్చ, పిచ్చి మీడియాను అడ్డుపెట్టుకుని రాష్ట్రాన్ని అల్లకల్లోలం చేయడానికి యత్నిస్తున్నాడన్నారు. అయితే అతన్ని పోలీసులు కొట్టారని, హింసకు గురిచేశారని తప్పుడు ఫొటోలతో ఈనాడు కథనాలను వండటం హేయమైన చర్యన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీం అహమ్మద్, రాష్ట్ర నాటక అకాడమీ చైర్‌పర్సన్ రాగే హరిత, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, రాష్ట్ర డైరెక్టర్లు శ్రీదేవి, గౌస్‌బేగ్, శోభారాణి, వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు ఉమ్మడి మదన్‌మోహన్ రెడ్డి, జిల్లా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు కొర్రపాడు హుస్సేన్‌పీరా, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు ఎగ్గుల శ్రీనివాసులు, కార్పొరేటర్లు చంద్రమోహన్‌రెడ్డి, కమల్‌భూషణ్, దేవి, కోఆప్షన్ సభ్యుడు షంషోద్దీన్, వైఎస్సార్‌సీపీ నాయకులు రమేష్‌గౌడ్, చామలూరు రాజగోపాల్, నాగేంద్ర, రాధాకృష్ణ, మహబూబ్ బాషా, ఖాదర్, మదార్, భారతి, శోభాబాయి, అనిత, బోయ చిన్న, ఇమ్రాన్, కువైట్ ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

విద్వేషాన్ని పెంచేలా కట్టుకథలు..

రాప్తాడు: ఈనాడు అధినేత రామోజీరావు ప్రభుత్వంపై ప్రతినిత్యం తన అక్కసును వెళ్లగక్కుతున్నారు. ఈనాడువి విషపు రాతలు. ప్రభుత్వంపై ప్రజల్లో విద్వేషాన్ని పెంచేలా కట్టుకథలు రాస్తున్నారని వైఎస్సార్‌సీపీ నాయకులు మండిపడ్డారు. ఈనాడు వస్తున్న కథనాలను నిరసిస్తూ రాప్తాడు జెడ్పీటీసీ సభ్యురాలు పసుపుల హేమావతి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, యూత్ మండల కన్వీనర్ చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి స్థానిక బస్టాండు వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఈనాడు పత్రిక ప్రతులను దహనం చేశారు. కార్యక్రమంలో అనంతపురం జెడ్పీటీసీ సభ్యుడు జూటూరు చంద్రకుమార్, రూరల్ కన్వీనర్ గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అగ్నికి ఆహుతైన గొర్రె పిల్లలు



అగ్ని ప్రమాదంలో కాలిపోయిన గొర్రె పిల్లలు

కంబదూరు: ప్రమాదవశాత్తూ జరిగిన అగ్ని ప్రమాదంలో 83 గొర్రె పిల్లలు మృత్యువాత పడ్డాయి. మండలంలోని వైపీపల్లికి చెందిన గొర్రెల కాపరులు బడప్ప, రాము, రంగారెడ్డి, ములకేష్ శుక్రవారం తమ గొర్రెల మందను తీసుకొని గ్రామ సమీపంలోని తమ పొలాల్లోకి మేత కోసం తీసుకెళ్లారు. మిగిలిన గొర్రె పిల్లలు మాత్రం బీడు భూమిలోనే వదిలేసి వెళ్లారు. అయితే ఆ సమయంలో ప్రమాదవశాత్తూ బీడు భూమికి నిప్పు పడటంతో నలుమూలలా మంటలు వ్యాపించాయి. దీంతో అక్కడే ఉన్న గొర్రె పిల్లలు మంటల్లో చిక్కుకొని కాలిబూడిదయ్యాయి. దీంతో సుమారు రూ.4 లక్షల దాకా నష్టం వాటిల్లినట్లు బాధిత గొర్రెల కాపరులు తెలిపారు.

ఇద్దరిపై పోక్సో కేసు

- ఏడుగురిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

గార్లదిన్నె: మండల పరిధిలోని పెనకచెర్ల గ్రామానికి చెందిన ఇద్దరిపై పోక్సో కేసు, ఏడుగురిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సాగర్ పేర్కొన్నారు. శుక్రవారం ఎస్‌ఐ విలేకరులతో మాట్లాడుతూ పెనకచెర్ల గ్రామానికి చెందిన గణేష్ అనే యువకుడు అదే గ్రామానికి చెందిన ఓ మైనర్ బాలికను వేధిస్తున్నట్లు బాలిక తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారని తెలిపారు. ఇందులో భాగంగానే గణేష్, ఓబులేసుపై పోక్సో కేసు నమోదు చేశామన్నారు. మరోవైపు ఓ వర్గం వారు గణేష్‌ను కులం పేరుతో దూషించడంతో పాటు దాడి చేశారని ఫిర్యాదు అందడంతో ఏడుగురిపై ఎస్సీ,ఎస్టీ కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. శేఖర్, మారుతి, రాము, సుధాకర్, అంజి, రవి, వెంకటేష్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

క్షయవ్యాధి నిర్మూలనకు కృషి



క్షయవ్యాధి గ్రస్తులకు పౌష్టికాహార కిట్లు అందిస్తున్న అనుపమ జేమ్స్

ఉరవకొండ: వచ్చే రెండేళ్లలో దేశంలో ఒక్క క్షయ కేసు కూడా నమోదు కాకుండా ప్రతి ఒక్కరు కలిసికట్టుగా క్షయ నిర్మూలనకు కృషి చేయాలని క్షయ వ్యాధి జిల్లా నియంత్రణ అధికారిణి డాక్టర్ అనుపమ జేమ్స్ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక లయన్స్ క్లబ్ కార్యాలయంలో కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న టీబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా క్షయవ్యాధిగ్రస్తులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచితంగా పౌష్టికాహార కిట్లు పంపిణీ చేశారు. ఉరవకొండ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సప్తగిరి మల్లికార్జున అధ్యక్షతన జరిగిన సమావేశంలో అనుపమ జేమ్స్ మాట్లాడుతూ క్షయవ్యాధిగ్రస్తులు క్రమం తప్పకుండా మందులు వేసుకోని పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. బ్యాక్టీరియా ద్వారా వ్యాపించే క్షయవ్యాధి పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలన్నారు.

గొంతుకోసుకున్న విద్యార్థి

- పరీక్షల్లో ఫెయిల్ అవుతానేమోనన్న ఆందోళనే కారణం



విద్యార్థి నాగార్జున

ఆత్మకూరు: పదో తరగతి పరీక్షల్లో ఫెయిల్ అవుతానేమోనన్న భయంతో గొంతుకోసుకొని ఓ విద్యార్థి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యుల వివరాలమేరకు... రొద్దం మండలంలోని ఆర్.లోచెర్ల గ్రామానికి చెందిన నాగార్జున అనే పదో తరగతి విద్యార్థి ఈనెల 21న రొద్దంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. చుట్టుపక్కల గాలించినా ఫలితం లేకపోవడంతో తల్లి నాగలక్ష్మి ఫిర్యాదు మేరకు రొద్దంలోని పోలీసుస్టేషన్‌లో విద్యార్థి అదృశ్యం కేసు నమోదు చేశారు. అయితే 23న ఆత్మకూరులోని మారెమ్మ ఆలయం వద్ద ఓ బాలుడు ఒంటరిగా ఉండటం చూసిన స్థానికులు ఆ బాలుడికి అన్నం పెట్టారు. ఆ బాలుడు వివరాలు సరిగా చెప్పకపోవడంతో రాత్రికి ఆలయం వద్దనే పడుకుంటా అని చెప్పడంతో స్థానికులు ఆ బాలుడిని బీసీ హాస్టల్‌లో రాత్రికి పడుకొని ఉదయమే ఊరికి వెళ్లు అని హాస్టల్‌లో వదిలి వెళ్లారు. అయితే ఆ బాలుడు గురువారం అర్ధరాత్రి బాత్రూంలోకి వెళ్లి బ్లేడుతో గొంతు కోసుకున్నాడు. వెంటనే అప్రమత్తమైన విద్యార్థులు , హాస్టల్ సిబ్బంది ఆ బాలుడిని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎస్‌ఐ రంగయాదవ్ ఆ బాలుడి ఆచూకీ తెలుసుకొని తల్లి నాగలక్ష్మికి శుక్రవారం అప్పగించారు. త్వరలో పదో తరగతి పరీక్షలు జరగనున్నాయని, ఫెయిల్ అవుతానేమోనన్న భయంతోనే ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు నాగార్జున తెలిపాడు. ఆ బాలుడికి నచ్చచెప్పి తల్లి నాగలక్ష్మితో ఇంటికి పంపించారు.

కూతురి ప్రేమ వివాహం..
తల్లిదండ్రుల ఆత్మహత్యాయత్నం




మారన్న, లక్ష్మమ్మలను ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

గుడిబండ: కూతురు ప్రేమ వివాహం చేసుకోవడాన్ని జీర్ణించుకోలేక తల్లిదండ్రులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన మండల పరిధిలోని చిగతుర్పి గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాలమేరకు... చిగతుర్పి గ్రామానికి చెందిన లక్ష్మమ్మ, మారన్న దంపతులు. అయితే వీరి కుమార్తె చైత్ర రెండు రోజుల క్రితం ప్రేమ వివాహం చేసుకుంది. తల్లిదండ్రులు ఎంత నచ్చచెప్పినా ఇంటికి రానని తేల్చిచెప్పడంతో వారు తీవ్ర మనస్థాపానికి గురయ్యారు. ఇందులో భాగంగానే పురుగుల మందు తాగారు. గమనించిన కుటుంబ సభ్యులు 108 వాహనంలో మడకశిర ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్సకోసం హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వారి పరిస్థితి విషమంగా ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

విలువల తూణీరం తిమ్మారెడ్డి

- నేడు వర్ధంతి సభ
- విశిష్ట అతిథిగా హాజరుకానున్న దేవులపల్లి అమర్



తిమ్మారెడ్డి

అనంతపురం కల్చరల్: 'కొంత మంది యువకులు రాబోవు యుగం దూతలు'..అని మహాకవి శ్రీశ్రీ అన్నట్టు ..ఏ కొద్దిమంది మాత్రమే సమాజంపై బలమైన ముద్ర వేసుకోగలుగుతారు. పీడిత, తాడిత వర్గాల పక్షాన నిలిచి ప్రభావితం చేయగలుగుతారు. ఆ కోవకు చెందిన రాకెట్ల తిమ్మారెడ్డి అక్షరాన్ని ఆయుధంగా మార్చుకొని ఎన్నో సమస్యలకు పరిష్కార మార్గమయ్యాడు. ఉరవకొండ మండలం రాకెట్ల గ్రామంలో జన్మించిన ఆయన.. విద్యార్థి దశ నుంచే పోరాటబాట ఎంచుకొని బాధితుల, శ్రామికుల పక్షాన నిలబడ్డాడు. ఎందరో శత్రువులుగా మారినా, చెదరని, బెదరని ధైర్య సాహసాలే ఆయన జనహృదయాల్లో నిలిచేలా చేశాయి.

విలువలనే అక్షరాలుగా మార్చి..

సమాజాన్ని ప్రక్షాళన చేయడానికి పత్రికా రంగానికి మించిన పరిష్కారం మరేది లేదని భావించిన తిమ్మారెడ్డి .. విలువలతో కూడిన జర్నలిజం వైపు దృష్టి సారించాడు. ఆంధ్రప్రభ, విశాలాంధ్ర పత్రికల్లో రిపోర్టర్‌గా, సబ్ ఎడిటర్‌గా దశాబ్దాల పాటు వివిధ హోదాల్లో పనిచేసి, ఆదర్శ ఆలోచనా విధానాన్ని నేర్పించారు. జర్నలిజానికి కొత్త ఆకర్షణ తీసుకొచ్చిన ఏబీకే ప్రసాద్, రామచంద్రమూర్తి, నండూరి పార్థసారథి వంటి వారి శిక్షణలో రాటుదేలారు. అక్షరాన్ని సత్యం వైపు మళ్లించడానికి, నమ్మిన సిద్ధాంతాన్ని ఊపిరి ఉన్నంత వరకు వదలకుండా ఉండడానికి సంఘంతో యుద్ధం చేయాల్సి వచ్చింది. రాయలసీమ సమస్యలకు అద్దం పట్టే ఆయన రాసిన ఎన్నో విలువైన వ్యాసాలు అతన్ని నిఖార్సయిన జర్నలిస్టుగా మార్చాయి.

ప్రజాకోణమే కొలబద్ధగా...

నానాటికి పెరుగుతున్న కుటుంబ సమస్యలు ఓ వైపు పట్టి లాగుతున్నా ప్రజా కోణాన్నే కొలబద్ధగా మార్చుకొని వార్తలల్లిన తీరు ఆదర్శ పాత్రికేయుడిగా మార్చింది. మరో వైపు తండ్రిని, సోదరుడిని భూస్వాములు కడతేర్చినా నిర్వేదాన్ని చూపకుండా అగ్నిగుండాలు రగులుతున్నా సత్యం వైపు నిలబడి చిరస్మరణీయుడయ్యారు. నిత్యం ప్రజా సంఘర్షణలో అనారోగ్యాన్ని కొని తెచ్చుకోవడంతో 45 ఏళ్ల ప్రాయంలోనే కన్నుమూశారు. మనిషిగా ఆయన మన మధ్య లేకున్నా ఆయన వదిలి వెళ్లిన విలువలు, చూసిన పోరు బాట తర్వాతి ఎంతో మంది పాత్రికేయులకు మార్గదర్శకాలుగా మారాయి.

నేడు జర్నలిజంపై సదస్సు..

సీనియర్ జర్నలిస్టు తిమ్మారెడి వర్ధంతి సందర్భంగా శనివారం ఉదయం 11 గంటలకు జిల్లా కేంద్రంలోని లలితకళా పరిషత్‌లో 'జర్నలిజం నాడు - నేడు' అనే అంశంపై సదస్సు నిర్వహిస్తున్నారు. అన్ని పత్రికల జిల్లా జర్నలిస్టులు వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. సీనియర్ జర్నలిస్టు విశ్వనాథ్ అధ్యక్షతన జరుగనున్న సదస్సుకు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, ఎంపీ తలారి రంగయ్యతో పాటు జాతీయ మీడియా సలహాదారు దేవులపల్లి అమర్ విశిష్ట అతిథులుగా విచ్చేస్తున్నారు. అదేవిధంగా తిమ్మారెడ్డి సమకాలికులు కూడా హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు.

ఆంధ్ర జట్టుకు 'అనంత' క్రీడాకారులు



రాజకుళ్లాయప్ప



సంతోష్



మల్లికార్జున



దత్తారెడ్డి

అనంతపురం సప్తగిరి సర్కిల్: ఆంధ్ర అండర్-23 క్రికెట్ జట్టుకు జిల్లాకు చెందిన క్రీడాకారులు ఎంపికయ్యారు. జిల్లా నుంచి రాజకుళ్లాయప్ప, సంతోష్, మల్లికార్జున, దత్తారెడ్డి ఎంపికయ్యారు. వీరు వచ్చే నెల 3 నుంచి బీసీసీఐ ఆధ్వర్యంలో జరిగే ఇన్విటేషనల్ క్రికెట్ టోర్నీలో జిల్లా నుంచి ఆంధ్ర క్రికెట్ జట్టులో ప్రాతినిధ్యం వహించనున్నారు. ఇటీవల జరిగిన టోర్నీల్లో అద్భుతమైన ఆటతీరుతో రాష్ట్ర జట్టులో చోటును దక్కించుకున్నారు. ఈ సందర్భంగా వారిని ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛో ఫెర్రర్, జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ప్రకాష్‌రెడ్డి, మధు ప్రత్యేకంగా అభినందించారు.

ఏపీలో అతిపెద్ద మెగా టౌన్‌షిప్ హార్మోని సిటీ

రాప్తాడు: రాష్ట్రంలోనే అతి పెద్ద మెగా టౌన్‌షిప్‌గా హార్మోని సిటీని 150 ఎకరాల్లో నిర్మిస్తున్నట్లు కార్బన్ మొబైల్స్ చైర్మన్ సుధీర్ హసిజ పేర్కొన్నారు. శుక్రవారం రాప్తాడు మండలంలోని ప్రసన్నాయపల్లి సమీపంలోని 44వ జాతీయ రహదారిపై ఉన్న హార్మోని సిటీలో గోల్డెన్ గ్లోబ్ ఇన్‌ఫ్రా ఎండీ రవికుమార్ ఆధ్వర్యంలో హార్మోని సిటీలో నిర్మితమవుతున్న 40 మీటర్ల ఎత్తైన క్లాక్ టవర్, 15 అంతస్తుల సిగ్నేచర్ టవర్స్ అపార్ట్‌మెంట్‌ను సుధీర్ హసిజ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కార్బన్ మొబైల్స్ చైర్మన్ సుధీర్ హసిజ మాట్లాడుతూ హార్మోని సిటీలో ఇంటర్నేషనల్ స్కూల్, హస్పిటల్స్, కన్వెన్షన్ సెంటర్ మాల్, ఐటీ కంపెనీలు, ఓపెన్ ప్లాట్స్, విల్లాలు, అపార్ట్‌మెంట్లతో సకల సౌకర్యాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. ఇలాంటి సౌకర్యాలు బెంగళూరు లాంటి పెద్ద పెద్ద నగరాల్లో కూడా లేవన్నారు. గోల్డెన్ గ్లోబ్ ఇన్‌ఫ్రా ఎండీ రవికుమార్ మాట్లాడుతూ హార్మోని సిటీలో బెస్ట్ ఇంటిగ్రేటెడ్ టౌన్ షిప్‌ను కార్బన్ మొబైల్స్ చైర్మన్ సుధీర్ హసిజ సహకారంతో మొదలు పెట్టినట్లు పేర్కొన్నారు. స్టాటెడ్ మల్టిప్లెక్స్ అండ్ స్మాల్ కమర్షియల్ కాంప్లెక్స్, ఐటీ పార్క్‌తో పాటు 15 ఫ్లోర్ల ఎత్తైన భవనాన్ని నిర్మించబోతున్నామన్నారు. ఇది మన రాష్ట్రంలోనే నంబర్ వన్ ప్రాజెక్టుగా నిలిచిపోతుందన్నారు. అలాగే బ్యూటిఫుల్ క్లబ్ హౌస్‌ను నిర్మించబోతున్నానని, క్లబ్ హౌస్‌తో పాటు విల్లాస్, సెలబ్రెటీ హోమ్స్, క్లాసికల్ హోమ్స్‌తో అనంతపురం ప్రజలకు మంచి సదుపాయలతో బ్యూటిఫుల్ ప్రాజెక్టును నిర్మించబోతున్నట్లు వివరించారు.



15 అంతస్తుల సిగ్నేచర్ టవర్స్‌ను ప్రారంభిస్తున్న కార్బన్ మొబైల్స్ చైర్మన్ సుధీర్ హసిజ, గోల్డెన్ గ్లోబ్ ఇన్‌ఫ్రా ఎండీ రవికుమార్

సిమెంట్ లోడ్ పేరిట బురిడీ

- లబోదిబోమంటున్న బాధితుడు

సోమందేపల్లి: అతి తక్కువ ధరకే సిమెంట్ బస్తాలు సరఫరా చేస్తామని నమ్మబలికి గుర్తు తెలియని వ్యక్తి రూ.25 వేలు కాజేశాడు. మండల కేంద్రమైన సోమందేపల్లిలోని కొత్తపల్లి క్రాస్ వద్ద సిమెంట్ ఇటుకల తయారీ దారుడైన చంద్రకు గురువారం ఓ వ్యక్తి ఫోన్ చేసి 300 బస్తాల సిమెంట్ పెనుకొండ నుంచి పంపుతానని చెప్పాడు. మార్కెట్ ధర కన్న తక్కువ మొత్తానికి ఇస్తానని పెనుకొండకు చెందిన ఓ సిమెంట్ వ్యాపారితో సైతం ఫోన్ కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడించాడు. అయితే అడ్వాన్స్ రూ.25వే లు ఫోన్ పే ద్వారా పంపాలని కోరడంతో చంద్ర పంపించాడు. అయితే కొద్ది సేపటికి ఓ వాహనంలో రూ.300 బస్తాలు సిమెంట్ లోడుతో పెనుకొండకు చెందిన వ్యాపారి తీసుకువచ్చాడు. మొత్తం సొమ్ము ఇవ్వాలని వ్యాపారి చెప్పగా ఇప్పటికే రూ. 25 వేలు చెల్లించానని చంద్ర తెలిపారు. వారితో తమకు సంబంధం లేదని డెలివరీ చేయకుండా వెనక్కి వెళ్లిపోవడంతో మోసపోయానని గ్రహించిన బాధితుడు చంద్ర ఫోన్ పే చెల్లించిన నంబరుకు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్‌అని వచ్చింది. ఈ ఘటనపై శుక్రవారం స్థానిక పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశారు.

ఉపాధ్యాయులకు అండగా ఉంటాం

మడకశిర: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడానికి కృషి చేసి వారికి అండగా ఉంటాను. ప్రస్తుతం పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానం నుంచి వైఎస్సార్‌సీపీ తరుపున పోటీలో ఉన్న రామచంద్రారెడ్డికి ఓట్లు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి ఉపాధ్యాయులను కోరారు. ఆమె శుక్రవారం మడకశిర నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించి ఎమ్మెల్సీ అభ్యర్థులు రామచంద్రారెడ్డి, వెన్నపూస రవీంద్రారెడ్డికి మద్దతుగా ప్రచారం చేశారు. మడకశిర పట్టణంతో పాటు అగళి, అమరాపురం, రొళ్ల, గుడిబండ మండలాల్లోని వివిధ పాఠశాలలను ఆమె పరిశీలించారు.

క్లుప్తంగా

అనంతకు చేరుకున్న దేవులపల్లి అమర్



దేవులపల్లి అమర్‌ను కలిసిన ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై. విశ్వేశ్వర రెడ్డి

అనంతపురం: ఏపీ జాతీయ మీడియా సలహాదారు దేవులపల్లి అమర్ శుక్రవారం రాత్రి అనంతపురానికి చేరుకున్నారు. సీనియర్ జర్నలిస్ట్ వై. తిమ్మారెడ్డి (రాకెట్ల) 23వ వర్ధంతిని పురస్కరించుకొని 'జర్నలిజం –నాడు– నేడు –సదస్సు' అనే అంశంపై జరిగే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. లలిత కళాపరిషత్‌లో శనివారం ఉదయం 11 గంటలకు కార్యక్రమం ప్రారంభం కానుంది. అనంతపురానికి చేరుకున్న దేవులపల్లి అమర్‌ను ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర రెడ్డి సాదరంగా ఆహ్వానించారు.

రాష్ట్రంపై కేంద్రం సవతితల్లి ప్రేమ

ఆత్మకూరు: కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌పై సవతితల్లి ప్రేమ చూపుతోందని సీపీఎం మండల కార్యదర్శి శివశంకర్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ శుక్రవారం ఆత్మకూరులో సీపీఎం నాయకులు నిరసన తెలియజేశారు. ఆత్మకూరు సెంటర్ నుంచి బయల్దేరి తహసీల్దార్ కార్యాలయం వద్ద డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్‌కు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రామయ్య, రాజేశ్వరమ్మ, జయమ్మ, సరస్వతమ్మ, వెంకటమ్మ పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు పూజలు

రామగిరి: నసనకోట సమీపంలోగల ముత్యాలమ్మ ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ ఈఓ వెంకటేశ్వర్లు తెలిపారు. ఉదయాన్నే అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. పూజల్లో ఉమ్మడి జిల్లా వాసులేగాక, కర్ణాటక నుంచి భక్తులు తరలివచ్చారు. ఆలయంలో ప్రతి ఆది, శుక్ర, మంగళ వారాల్లో దేవదాయశాఖ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.

మదన్‌మోహన్‌రెడ్డికి సన్మానం



ఉమ్మడి మదన్‌మోహన్‌రెడ్డిని సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

అనంతపురం సప్తగిరి సర్కిల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడిగా నియమితులైన ఉమ్మడి మదన్‌మోహన్‌రెడ్డిని శుక్రవారం రాత్రి సన్మానించారు. నారాయణపురం పంచాయతీ పరిధిలోని తపోవనంలోని ఆయన నివాసంలో పుష్పగుచ్ఛం అందించి ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో బుక్కరాయసముద్రం వైఎస్సార్‌సీపీ నాయకుడు చింతామణి కుమార్, నారాయణపురం వైఎస్సార్‌సీపీ నాయకులు ఈశ్వరయ్య, లక్ష్మయ్య, కుళ్లాయిస్వామి, శివ, తిప్పేస్వామి, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మాధవరాజుల రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఆత్మకూరు: మండలంలోని సనపలోని మాధవరాజుల స్వామి రథోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. వేలాది భక్తులు రథోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం ఆలయంలో మాధవరాజు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

నేడు రాతిదూలం లాగుడు పోటీలు : ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, తోపుదుర్తి బ్రదర్స్ ఆధ్వర్యంలో శనివారం పెద్ద ఎత్తున రాతిదూలం లాగుడు పోటీలు నిర్వహించనున్నారు. రాతిదూలం పోటీల్లో మొదటి బహుమతి రూ.40 వేలు, రెండో బహుమతి రూ.30 వేలు, మూడో బహుమతి రూ.20 వేలు, నాల్గో బహుమతి రూ.10 వేలు, ఐదో బహుమతి రూ.5 వేలు లను విజేతలకు అందించనున్నారు.

టౌన్ ప్లానింగ్ అక్రమాలపై డీటీసీపీ ఆరా

- 'సాక్షి' కథనాలకు స్పందించిన డీటీసీపీ
- టౌన్ ప్లానింగ్ అక్రమాలపై విచారణ చేయనున్న ఆర్డీటీపీ



అనంతపురం క్రైం: నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ అధికారుల అక్రమాలు, బాధ్యతారాహిత్యంపై డైరెక్టర్ ఆఫ్ టౌన్, కంట్రీ ప్లానింగ్ స్పందించారు. ఈ మేరకు డీటీసీపీ అదనపు కమిషనర్ బీ శ్రీనివాసులు టౌన్ ప్లానింగ్ అక్రమాలపై సమగ్ర నివేదక సమర్పించాలని రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ టౌన్ ప్లానింగ్ దేవికుమారిని ఆదేశించారు. వివరాలు.. ఇటీవలకాలంలో భవన నిర్మాణాల్లో ఆక్రమణలు, అనుమతి లేకుండా నిర్మాణాలు, కేవలం ఖాళీ జాగా పన్ను చెల్లించి టెంపరరీ షెడ్ల పేరుతో చేపట్టిన బడా వ్యాపారాలను అడ్డుకోవడంలో టౌన్ ప్లానింగ్ విఫలమయ్యారు. దీనిపై 'సాక్షి'లో ఆక్రమణలకు అడ్డుకట్ట ఏదీ? , 'ఆక్రమణలకు పక్కా ప్రణాళిక' ప్రభుత్వ ఆదాయానికి గండి శీర్షికలతో కథనాలు ప్రచురితమయ్యాయి. వీటిపై కమిషనర్ కే భాగ్యలక్ష్మి ఏసీపీలు శ్రీనివాసులు రెడ్డి, సువర్ణ, ఇన్‌చార్జ్ టీపీఓ మహబూబ్‌జాన్, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు దుర్గాంజలి, మురళీకి మెమోలు జారీ చేస్తూ, టౌన్ ప్లానింగ్ బాధ్యతారాహిత్యంపై డీటీసీపీకి ఫిర్యాదు చేశారు. దీంతో డీటీసీపీ మంగళగిరి స్పందించారు.

ఆర్డీ విచారణ:

నగరంలోని వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న భవనాల అతిక్రమణలు, అనధికార సెల్లార్ల ఏర్పాటు, అనుమతులు లేకుండా నిర్మిస్తున్న భవనాలు, షెడ్లు తదితర వాటిపై రీజినల్ డైరెక్టర్ ఆఫ్ టౌన్ ప్లానింగ్ విచారణ చేపట్టనున్నారు. ఇప్పటికే నగరంలో వెయ్యికిపైగా భవనాలు నిర్మాణ దశలో ఉన్నాయి. అందులో ఎక్కడైనా అక్రమాలు బయటపడితే టౌన్ ప్లానింగ్ అధికారులపై క్రమశిక్షణా చర్యలు తీసుకునే అవకాశం ఉంది. ఇప్పటికే టౌన్ ప్లానింగ్ అధికారులకు పదుల సంఖ్యలో మెమోలు జారీ అయ్యాయి. ఇదిలా ఉండగా డీటీసీపీ విచారణకు ఆదేశించడంతో టౌన్ ప్లానింగ్ అధికారులు గుబులు పట్టుకుంది.

ప్లానింగ్ కార్యదర్శిపై కమిషనర్ మండిపాటు

అనంతపురం క్రైం: కోర్టు రోడ్డులోని పార్క్‌లో ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణం జరుగుతుంటే మీరేం చేస్తున్నారు? కనీస బాధ్యత లేకపోతే ఎలా? .. ఇష్టారాజ్యంగా విధులు నిర్వర్తిస్తే సస్పెండ్ చేస్తానని 26వ సచివాలయం ప్లానింగ్ కార్యదర్శి అమీనపై కమిషనర్ భాగ్యలక్ష్మి శుక్రవారం ఫోన్‌లో మండిపడ్డారు. పార్కుల్లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టకుండా చూసుకోవాలన్నారు. ఏసీపీ శ్రీనివాసులు రెడ్డి, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ మురళిని ప్రభుత్వ స్థలాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనంతరం ఏసీపీ, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు పార్క్‌లో ఇటీవల కట్టిన నిర్మాణాన్ని తొలగించేలా చర్యలు తీసుకున్నారు.

పోతలయ్యస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే



ఆలయంలో పోతులయ్య, చెన్నేకేశవ స్వాములను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

కనగానపల్లి: మండలంలోని దాదులూరులో జరిగిన పోతలయ్యస్వామి జాతరలో శుక్రవారం ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు మేళతాళాలతో స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే ఆలయంలోని పోతులయ్య, చెన్నేకేశవస్వాములను దర్శించుకున్నారు. ఆలయ పూజార్లు ప్రత్యేక పూజలు నిర్వహించి ఎమ్మెల్యేకు తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కుర్లపల్లి నరసింహారెడ్డి, స్థానిక సర్పంచ్ మురళీ, ఆలయ కమిటీ చైర్మన్ రామలింగారెడ్డి, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హుండీ కానుకల లెక్కింపు నేటికి వాయిదా

కూడేరు: స్థానిక శివపార్వతుల జోడు లింగాల సంగమేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం జరగాల్సిన హుండీ కానుకల లెక్కింపు కొన్ని అనివార్య కారణాలతో శనివారానికి వాయిదా వేసినట్లు ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బి.బాబు శుక్రవారం తెలిపారు. ఆలయ సేవ, జీర్ణోద్ధారణ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు హాజరు కావాలని ఈఓ కోరారు.

సచివాలయాల తనిఖీ

రామగిరి: మండలంలోని నసనకోట, మాదాపురం సచివాలయాలను శుక్రవారం ఎంపీడీఓ ఆజాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అర్హులకు సంక్షేమ పథకాలు అందించాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అంతకుముందు ఆయన రికార్డులు పరిశీలించారు. సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించి, ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు.

47 క్లాప్ ఆటోలతో చెత్త సేకరణ

- కమిషనర్ కే భాగ్యలక్ష్మి

అనంతపురం క్రైం: క్లీన్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా వివిధ సచివాలయాలకు కేటాయించిన 47 క్లాప్ ఆటోల ద్వారా ఆయా ప్రాంతాల్లో చెత్త సేకరణ పక్కాగా జరిగేలా చూడాల్సిన బాధ్యత ప్రజారోగ్యాధికారులదేనని కమిషనర్ కే భాగ్యలక్ష్మి స్పష్టం చేశారు. శుక్రవారం ఉదయం నగరపాలక సంస్థలో ప్రజారోగ్యాధికారులు, పారిశుధ్య కార్యదర్శులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లతో కమిషనర్ సమావేశమయ్యారు. నిర్దేశించిన ప్రాంతాల్లో ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణ జరగాలన్నారు. చెత్తను రోడ్లపై, కూడళ్లలో పారేయకుండా ప్రజల్లో అవగాహన తీసుకురావాలన్నారు. వాహనాలు జాప్యం జరిగితే తక్షణమే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. నగర ప్రజలు ఇది వరకు అందించిన మూడు రంగుల డస్ట్‌బిన్ల ద్వారా తడి, పొడి, ప్రమాదకర చెత్తను వేరు చేసి ఇవ్వాలన్నారు. క్లాప్ ఆటో నిర్వాహకులు చెత్తను సక్రమంగా తీసుకెళ్లి, నిర్వహణను విజయవంతం చేయాల్సి ఉందన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ రమణారెడ్డి, ఎంహెచ్ఓ డాక్టర్ గంగాధర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

15 మంది ఎడ్యుకేషన్ కార్యదర్శులకు షోకాజ్‌లు

హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ విషయంలో 15 మంది ఎడ్యుకేషన్ కార్యదర్శులకు నగరపాలక సంస్థ కమిషనర్ భాగ్యలక్ష్మి షోకాజ్ శుక్రవారం నోటీసులు జారీ చేశారు. హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ విషయంలో 22 మంది దరఖాస్తుల్లో వివాహ ధ్రువీకరణ వివరాలు నమోదు చేయకపోవడంతో వాటిని కమిషనర్ తిరస్కరించారు. నిబంధనలకనుగుణంగా వివాహ ధ్రువీకరణ పత్రాన్ని తప్పక దరఖాస్తులో నమోదు చేయాలని తెలిపారు.



మాట్లాడుతున్న నగరపాలక సంస్థ కమిషనర్ భాగ్యలక్ష్మి

కాలువలను శుభ్రం చేయాలి

అనంతపురం క్రైం: కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసేలా చర్యలు తీసుకోవాలని అదనపు కమిషనర్ రమణారెడ్డి పారిశుధ్య కార్యదర్శులు, సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం నగరంలోని గుల్జార్‌పేట, లక్ష్మీనగర్‌లో పర్యటించారు. క్లాప్ ఆటోల చెత్త సేకరణ, పారిశుధ్య సిబ్బంది పనితీరును ఆయన ప్రత్యక్షంగా పరిశీలించారు. కొన్ని ప్రాంతాల్లో చెత్త సేకరణ, కాలువలు శుభ్రం చేయకపోవడంతో పారిశుధ్య కార్యదర్శులకు ఆయన చురకలంటించారు. బాధ్యతగా పని చేయాలని, లేని పక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బడ్జెట్ సమావేశానికి గ్రీన్ సిగ్నల్

అనంతపురం క్రైం: నగరపాలక సంస్థ 2023–24 బడ్జెట్ సమావేశానికి ఎన్నికల సంఘం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు చీఫ్ ఎలక్ట్రోల్ అధికారులు ముఖేష్‌కుమార్ మీనా బడ్జెట్ సమావేశం జరుపుకోవడానికి ఎలాంటి అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. కానీ ఆ బడ్జెట్ సమావేశం జరిగే రోజున వాటి వివరాలను పత్రికలకు విడుదల చేయకూడదని ఉత్వర్వుల్లో పేర్కొన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో గతంలో బడ్జెట్, కౌన్సిల్ సమావేశం వాయిదా వేసిన విషయం విదితమే.

అభాగ్యురాలికి అండగా 'అమ్మ'



వృద్ధురాలికి సాయం అందిస్తున్న 'అమ్మ' సంస్థ అధ్యక్షుడు రమణారెడ్డి

అనంతపురం కల్చరల్: బుక్కరాయసముద్రంలో నివసిస్తున్న ఒంటరి మహిళ లక్ష్మీనారాయణమ్మకు అమ్మ సంస్థ అండగా నిలిచింది. రెండు దశాబ్దాల క్రితం భర్త, ఉన్న ఒక్కగానొక్క కొడుకు మృతిచెందారు. ఫ్లోరైడ్‌తో ఓ కాలు వంకరగా మారి నడవడానికి వీలులేకుండా అయ్యింది. అనారోగ్యంతో ఒక కిడ్నీ తొలగించాల్సివచ్చింది. ప్రతినెలా ఖరీదైన మందులు వాడితే తప్ప.. బతకడానికి ఆస్కారం లేకుండా పోయింది. ఇలాంటి దుర్భర పరిస్థితుల్లో ఉన్న ఆమెను అమ్మ సంస్థ అధ్యక్షుడు తరిమెల రమణారెడ్డి స్పందించారు. శుక్రవారం రూ.10 వేలు విలువ చేసే నిత్యావసర వస్తువులు, మరో రూ.2 వేలు వెచ్చించి, మందులు, రూ.3 వేల నగదు అందించారు. ప్రతి నెలా కావాల్సిన మందులు, నిత్యావసర సరుకులు అందిస్తామని భరోసా ఇచ్చారు.

ఆర్టీఏలో పాత వాహనాల వేలం

అనంతపురం సెంట్రల్: రవాణాశాఖలో వివిధ సందర్భాల్లో పట్టుబడి సీజ్ చేసిన వాహనాలకు శుక్రవారం వేలం నిర్వహించారు. డీటీసీ శివరామప్రసాద్ ఆధ్వర్యంలో వేలం వేయగా రూ. 11.04 లక్షలు రవాణాశాఖకు ఆదాయం సమకూరినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీఓ సురేష్‌నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతికి కృషి చేస్తా

అనంతపురం సప్తగిరి సర్కిల్: మహిళల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి స్పష్టం చేశారు. తనపై నమ్మకంతో జిల్లా అధ్యక్షురాలిగా అవకాశం కల్పించినందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మహిళా పక్షపాతిగా మహిళలకు పెద్ద పీట వేస్తోందన్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి : కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కొర్రపాడు హుస్సేన్‌పీరా స్పష్టం చేశారు. వైఎస్సార్ ట్రేడ్ యూనియన్‌ను జిల్లా వ్యాప్తంగా బలోపేతం చేసేందుకు ఆయా కార్మికుల సంఘాలతో ప్రత్యేకంగా మాట్లాడి, వారిని జిల్లా కమిటీల్లో స్థానం కల్పించేలా చొరవ చూపుతామన్నారు.

లక్ష్మీనరసింహుడి కల్యాణోత్సవం

కూడేరు: మండలంలోని కలగళ్ల లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శుక్రవారం నృసింహుడి కల్యాణ మహోత్సవం వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ కనుల పండువగా సాగింది. వేడుకల్లో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా నృసింహుడు నామస్మరణ మార్మోగింది. సాయంత్రం స్వామి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగింపు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు.



నృసింహుడికి కల్యాణం జరిపించిన దృశ్యం

ఉమ్రా యాత్రతో ఆధ్యాత్మికత పెంపొందాలి


అనంతపురం సప్తగిరి సర్కిల్: ఉమ్రా యాత్ర ద్వారా ఆధ్యాత్మికత పెంపొందాలని నగర మేయర్ వసీం సలీం ఆకాంక్షించారు. స్థానిక ఐరన్ బ్రిడ్జి సమీపంలో జిల్లా నుంచి ఉమ్రా యాత్రకు వెళుతున్న 62 మందికి వారు వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా అల్ సమా టూర్స్ అండ్ ట్రావెల్స్ నేతృత్వంలో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన వారు ఉమ్రా యాత్రకు బయల్దేరారు. ఈ సందర్భంగా మౌలానా మహమూద్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఉమ్రా యాత్ర విజయవంతం కావాలని కోరారు. హజ్ తరువాత అత్యంత ప్రాముఖ్యత కలిగిన యాత్ర ఉమ్రాదేనని వివరించారు. ఉమ్రా యాత్రను అత్యంత భక్తి శ్రద్ధలతో చేసి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అల్ సమా ట్రావెల్స్ షేరు, కార్పొరేటర్ బాబా, జాఫర్, మౌలానా మహమూద్, మెహరాజ్, ఖాజా తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న నగర మేయర్ వసీం

నేటి నుంచి మాసుమా బీబీ,సారాన్ బీబీ ఉరుసు

అనంతపురం సప్తగిరి సర్కిల్: నగరంలోని పాతూరు మాల్దార్ వీధిలో వెలసిన మహిమాన్వితులు మాసుమా బీబీ,సారాన్ బీబీ ఉరుసు శనివారం నుంచి ప్రారంభం కానుంది.ఉదయం 6 గంటలకు గంధం ఊరేగింపుతో వేడుకలు ప్రారంభమవుతాయి. కుల, మతాలకతీతంగా ఈ వేడుకలో అన్ని వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొంటుండడం విశేషం. గంధాన్ని నగర వీధుల్లో పెద్ద ఎత్తున భక్తుల జన సందోహంతో ఊరేగింపు నిర్వహించనున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. వేడుకకు సద్గురువులు హజరత్ సయ్యద్ లతీఫ్ అహమ్మద్, ఆదోనికి చెందిన ఖాదర్ సాహెబ్, బనగానపల్లికి చెందిన హజరత్ సయ్యద్ హుస్సేన్ బాద్‌షా ఖాద్రి హాజరుకానున్నారు.



మాసుమా బీబీ, సారాన్ బీబీ దర్గా

ఎన్నికల నియమావళిని పాటించాలి

రాప్తాడురూరల్: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి (మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్)ని అన్ని రాజకీయ పార్టీలూ పాటించాల్సిందేనని ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి, పీఆర్ జేఈ శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు మండలస్థాయి కమిటీలో ఎంపీడీఓ బాబాఫక్రుద్దీన్, ఏఎస్ఐ నారాయణరెడ్డి, ఫ్లయింగ్ స్క్వాడ్ కమిటీలో జేఈ శ్రీనివాసరెడ్డి, ఏఎస్ఐ ఉన్నారు. శుక్రవారం ఆకుతోటపల్లిలోని పోలింగ్ స్టేషన్‌ను పరిశీలించారు. అన్ని వసతులు ఉండేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. అక్కడి నుంచి ఇటుకలపల్లికి వెళ్లారు. రాజకీయ పార్టీలకు సంబంధించిన ఫ్లెక్సీలు, జెండాలు లేకుండా చర్యలు తీసుకున్నారు.



పోలింగ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న అధికారులు

వ్యాధుల నిర్ధారణలో కచ్చితత్వాన్ని పాటించాలి

అనంతపురం సప్తగిరి సర్కిల్: వ్యాధుల నిర్ధారణలో కచ్చితత్వాన్ని పాటించాలని వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మైరెడ్డి నీరజ తెలిపారు. స్థానిక మెడికల్ కళాశాలలో మైక్రో బయాలజీ ఆర్‌టీపీసీఆర్, వ్యాధి నిర్ధారణపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మైరెడ్డి నీరజ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కోవిడ్ సమయంలో మైక్రో బయాలజీ విభాగం సిబ్బంది సేవలు ఎనలేనివన్నారు. కళాశాలకు చెందిన 70 మంది విద్యార్థులకు ప్రత్యేకంగా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మైక్రో బయాలజీ హెచ్ఓడీ డాక్టర్ శాంతిరెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు శైలజ, ప్రవీణ, ప్రియాంక, ట్యూటర్లు సునీల్‌కుమార్, పరదేశినాయుడు, సీనియర్ రెసిడెంట్లు లలితా భవాని, వీఆర్‌డీఎల్ సైంటిస్టులు అనురాధ, పీజీలు పాణిగ్రహి, నవాజ్, దివ్య, ఎల్లంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

1 నుంచి గాలికుంటు టీకాలు

గార్లదిన్నె: మండల వ్యాప్తంగా ఆవులు, ఎద్దులు, గేదేలు, దూడలకు మార్చి 1 నుంచి గాలికుంటువ్యాధి నివారణ కోసం టీకాలు వేస్తున్నట్లు పశువైద్యాధికారి రమేష్ తెలిపారు.శుక్రవారం ఆయన మండలకేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. పశువుల్లో గాలికుంటు వ్యాధి రాకుండా ముందు జాగ్రత్తగా ప్రతి ఆరు నెలలకోసారి ప్రభుత్వం ఉచితంగా టీకాలు వేస్తోందన్నారు. ఇందులో భాగంగా ఆయా గ్రామాల్లో ఉన్న దాదాపు 15,500 పశువులకు పశువైద్య సిబ్బంది నెల రోజుల పాటు టీకాలు వేస్తామన్నారు. మండలంలోని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఘనంగా ఉపవాస ఆరాధన

పామిడి: స్థానిక సీఎస్ఐ చర్చిలో శుక్రవారం క్రీస్తు శ్రమల దినాల స్మరణలో భాగంగా శుక్రవార సాయంకాలపు ఉపవాస ఆరాధన ఘనంగా నిర్వహించారు. దైవ సేవకుడు బ్రదర్ బాబావలి క్రైస్తవులను ఉద్దేశించి ప్రసంగించారు. దేవుని రాజ్యం, సువార్తను ప్రకటించక ముందు 40 రోజుల పాటు కఠోర ఉపవాస దినాలను ఆచరిస్తూనే శోధకుడైన సాతానును జయించారన్నారు. ఇలా క్రీస్తు శ్రమలదినాల్లో భాగంగా ఆయన సిలువలో పడిన బాధలను స్మరించుకుంటూ భస్మ బుధవారం నుంచి గుడ్ ఫ్రైడే, శనివారం వరకూ క్రైస్తవులు 40 రోజుల ఉపవాసదినాలు ఆచరిస్తానన్నారు. ఈ దినాల్లో క్రైస్తవులు ప్రార్థనలు, విశ్వాసంతో దేవుడిని ఆరాధిస్తారన్నారు. చర్చి సెక్రటరీ పరదేశి విజయశేఖర్‌రాజు, సభ్యులు, వీరయ్య, జయరాజు, జకరయ్య, అబ్రహాం, బుజ్జిబాబు, విజయభాస్కర్, ప్రసాద్, రజని, మేరి, ప్రిస్కిల్లా, ప్రశాంతి, లత తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో వ్యక్తిపై దాడి



దాడిలో గాయపడిన ఫయాజ్

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: ఇద్దరి మధ్య జరిగిన వాగ్వాదం ఒకరి ప్రాణం మీదకు తెచ్చింది. తిట్టాడని తాగిన మైకంలో స్క్రూ డ్రైవరుతో దాడి చేసి విచక్షణా రహితంగా పొడిచాడు. దీంతో తీవ్రంగా గాయపడిన వ్యక్తిని స్థానికులు స్పందించి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. త్రీటౌన్ సీఐ కత్తి శ్రీనివాసులు తెలిపిన మేరకు.. ఆరో రోడ్డులో నివాసం ఉంటున్న ఫయాజ్ స్థానికంగా ఓ క్యాటరింగ్‌లో వర్కర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం కూలిపనిలేకపోవడంతో ఖాళీగా ఉన్నాడు. మద్యం తాగి తనకు తెలిసిన కిరణ్ అనే వ్యక్తిని హేలనగా మాట్లాడాడు. ఆవేశానికి లోనైన కిరణ్ .. తన చేతి కందిన స్క్రూ డ్రైవరుతో ఫయాజ్‌పై విచక్షణారహితంగా దాడి చేశాడు. ఊహించని దాడితో ఎటు వెళ్లాలో తెలియని ఫయాజ్ అక్కడే కుప్పకూలిపోయాడు. అయినా కిరణ్ వదలకుండా దాడి చేస్తుండటంతో స్థానికులు స్పందించి కిరణ్‌ని పట్టుకున్నారు. కొన ఊపిరితో కొట్టు మిట్టాడుతున్న ఫయాజ్‌ను చికిత్స నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకున్న పోలీసులు నిందితుడి కోసం గాలిస్తున్నారు.